క్లుప్తంగా

మేళ్లచెరువులో శివుడిని తాకిన సూర్యకిరణాలు


శివాలయంలో శివుడిని తాకిన సూర్యకిరణాలు

మేళ్లచెరువు: మండల కేంద్రంలోని ఇష్ట కామేశ్వరీ సమేత స్వయం భుశంభులింగేశ్వరస్వామి వారిని సోమవారం సూర్యకిరణాలు తాకాయి. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి ముందు సూర్యకిరణాలు శివుడిని తాకుతుంటాయని అర్చకులు తెలిపారు. సోమవారం రోజున శివుడిని సూర్యకిరణాలు తాకడం విశిష్ఠతను సంతరించుకుంది. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి పూజలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై నేటి నుంచి సదస్సులు

నడిగూడెం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 27 నుంచి మార్చి నెల 2 వరకు సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న వల్లాపురం, సిరిపురం, నారాయణపురం, 28న కేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, 29న వేణుగోపాలపురం, బృందావనపురం, శ్రీరంగాపురం, మార్చి 1న రత్నవరం, తెల్లబల్లి, ఎకలాస్‌ఖాన్‌పేట, మార్చి 2న రామాపురం, చాకిరాల, నడిగూడెం గ్రామాలలో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భూసారం పెరిగేందుకు సహజసిద్ధ ఎరువుల తయారీ, చీడ, పీడల నివారణ కోసం వివిధ రకాల కషాయాల తయారీపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

విశ్వకర్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

మఠంపల్లి : విశ్వకర్మ యోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల వృత్తుల వారికి పథకం వర్తించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీఓ ఆంజనేయులు, కార్యదర్శులు, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో కాకతీయ కాలంలో నిర్మించిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి గ్రామస్తులు, ప్రముఖులు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జోగు సరోజనపిచ్చిరెడ్డి, జేపీఆర్ ఫౌండేషన్ కోశాధికారి అరవింద్‌రెడ్డి, బాల్లు వెంకటేశ్వర్లు, అనంత చంద్రయ్య, చామకూరి అంజి, కటకం వేణు, శ్రీదేవి, పిచ్చయ్య, చామకూరి సుధాకర్, బుచ్చిరెడ్డి గోవిందమ్మ, నందిపాటి సైదులు, పగడాల లక్ష్మి, పోకల వెంకన్న, సుందరి రమేష్, ఉపేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

నడిగూడెం : మండలంలోని వల్లాపురం రెవెన్యూ పరిధిలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయానికి, యాగశాలకు మంగళ తోరణాలు కట్టారు. గోపూజ, గణపతిపూజ నిర్వహించారు. పుణ్యాహవచనము, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశము, శాలసంస్కారం, అఖండ దీపస్థాపన, భింబగ్రహణము, వాస్తుపూజ, వాస్తుహోమము, పరియజ్ఞకరణము, మత్సంగ్రహణము తదితర పూజలను నిర్వహించారు. 28న ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉందని తెలి పారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన తాళ్లూరి ఆదెమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో రైతు సమన్వయ సమితి గ్రామ కోఆర్డినేటర్ మాడుగుల పరుశురాం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, తదితరులు ఉన్నారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం చేసి స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనా రాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ చేశారు. శివాలయంలో గల పార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీరేదెలా..

- నిరుపయోగంగా నీటితొట్లు
- వేసవిలో తాగునీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు
- నిర్వహణ మరిచిన అధికారులు


సీతారాంపురం గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

హుజూర్‌నగర్‌రూరల్ : మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు హుజూర్‌నగర్ మండలంలోని గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. వేసవికాలం ప్రారంభంలోనే ఎండలు మండిపోతుండడంతో సమయానికి నీరు దొరకక మూగజీవాలు గోస పడుతున్నాయి. గతంలో వాటర్ ట్యాంకులు, కుళాయిల వద్ద నీటి తొట్లు, సంపులను లక్షల రూపాయలతో నిర్మించిన పాలకులు, అధికారులు వాటి నిర్వహణను మాత్రం మరిచారు. దీంతో అవి అలంకారప్రాయంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో నీటి తొట్లు, సంపులు ఏర్పాటు చేయకపోవడంతో పశువులకు నీటి కోసం పశుపోషకులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి పొలం పనులకు బయలుదేరినప్పటి నుంచి మళ్లీ ఇంటికి వచ్చే వరకు మూగజీవాలకు నీరు పెట్టే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి రెండు చోట్ల ఉన్న నీటి తొట్లలో నీరు ఉన్నా అపరిశుభ్రంగా ఉంది. అయినా మరో మార్గం లేక ఆ నీటినే పశువులకు పెడుతున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం..

మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో ఒక్కొక్క గ్రామానికి సుమారుగా 3 నుంచి 4 నీటి తొట్లను ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించారు. ఒకటి రెండు చోట్ల మినహా నీటితొట్లన్నీ అలంకార ప్రాయంగానే మారాయి. ఆవులు, గెదేలు, మేకలు, గొర్రెల దప్పిక తీర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నీటితొట్లను నిర్మించింది. కానీ వాటి నిర్వహణను చూడాల్సిన అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత లక్ష్యం నీరుగారిపోతోంది. దీంతో రైతులు తమ పశువులకు, గొర్రెలకు, మేకలకు నీరు తాపడానికి దూర ప్రాంతాల్లో ఉన్న చెరువులను, కుంటలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి నీటితొట్లకు నీటి సౌకర్యం కల్పించి వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చాలని రైతులు కోరుతున్నారు.

నీటితొట్లను వినియోగంలోకి తీసుకురావాలి



గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు అలంకార ప్రాయంగా మారాయి. ప్రస్తుతం ఎండలు మండతుండటంతో పశువులకు నీరు దొరక్క అల్లాడుతున్నాయి. పశువులకు నీరు తాపేందుకు చెరువులు, కుంటలను ఆశ్రయించాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటి తొట్లను వినియోగంలోకి తీసుకురావాలి.

– గూడెపు అంజయ్య, రైతు, బూరుగడ్డ

కోదాడ పీఏసీఎస్ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి


పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోదాడఅర్బన్ : కోదాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా గుడిబండ గ్రామానికి చెందిన ఓరుగంటి శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోదాడ పీఏసీఎస్ కార్యాలయంలో 12 మంది డైరెక్టర్లతో సూర్యాపేట డీఎస్‌ఓ పద్మ ప్రత్యేక సమావేశం నిర్వహించి సంఘం సభ్యులందరి ఆమోదంతో శ్రీనివాసరెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. రైతుల సంక్షేమానికి కృషి చేయాలని, సంఘం అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇందిరా, పద్మజ, రవికుమార్, వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, తూమాటి వరప్రసాదరెడ్డి, ఆవుదొడ్డి ధనమూర్తి, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, పార్వతి, వెంకటయ్య, ప్రభాకర్‌రావు, బాబు, గోప్రా, శ్రీనివాసరావు, చంద్రమౌళి, సీతారామయ్య, రమాదేవి, శ్రీనివాసరావు, సీఈఓ మంద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పట్టణాన్ని అభివృద్ధి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న గెల్లి రవి

హుజూర్‌నగర్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో హుజూర్‌నగర్ పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని పట్టణ అభివృద్ధి సలహా కమిటీ సభ్యులు గెల్లి రవి, తన్నీరు మల్లికార్జున్, యరగాని నాగన్న, అరుణ్ కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. సోమవారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన అభివృద్ధి సలహా కమిటీ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ మంజూరు చేయించిన రూ 1.కోటి నిధులతో టౌన్ హాల్‌లో మరుగుదొడ్లు, ప్రహరీ, వంటశాల, ఆర్చీలను నిర్మించాలని, పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని, హాల్ పైభాగంలో అధునాతనంగా మీటింగ్ హాల్ నిర్మించి సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. క్రైస్తవ శ్మశాన వాటిక అభివృద్ధికి మంజూరైన రూ.50 లక్షలతో పనులు చేపట్టాలని చెప్పారు. పట్టణంలో కృష్ణా నీటిని పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ భాస్కర్, ఏఈ శివకుమార్, సలహా కమిటీ సభ్యులు దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, చక్ర వీరారెడ్డి, కేవీఎస్ మూర్తి, గల్లా వెంకటేశ్వర్లు, ముషం సత్యనారాయణ, అనంత రాములు, గజ్జి ప్రభాకర్, దామోదర్‌రెడ్డి నిజాముద్దీన్, నరేందర్‌రెడ్డి, దేవరం రామిరెడ్డి, చంద్రశేఖర్, పిట్టల రవి, కొత్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సోమప్పలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


సోమప్ప దేవాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నేరేడుచర్ల : మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ పరిధిలోని సోమప్ప దేవాలయంలో మార్చి 8న జరిగే శివరాత్రి ఏర్పాట్లను సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. శివరాత్రి ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, ఎస్ఐ రవీందర్‌నాయక్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశాస్త్రి, నాయకులు రామారావు, సురేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామకృష్ణ, గోవింద్, గణేష్‌రెడ్డి, సత్యనారాయణ, చిన సీతారాంరెడ్డి, సైదులు, వినయ్, శ్రీను, సోములు, బాలమణి ప్రసాద్, అజయ్, కృష్ణారావు, సంజీవరెడ్డి, సుధాకర్, మోహన్, గఫార్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం


స్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఫణిగిరి గట్టుపై ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని విశ్వక్సేనులను పురుషసూక్త సహితంగా అభిషేకం చేసి పట్టు వస్త్రాలు తులసిమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సప్తస్వర, శ్రీనివాస భజన మండలి గాయకులు కంబాల శ్రీనివాస్, వెంకట శివ, వెంకటరామయ్య పాడిన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. రంగస్థల కళాకారులు దొంతగాని బృందం ప్రదర్శించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ యువకులను ఉత్సాహపరిచింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి, అర్చకులు నరసింహాచార్యులు, భాస్కరాచార్యులు, దామోదరాచార్యులు, రామకృష్ణమాచార్యులు, జగన్నాథాచార్యులు, మోహనకృష్ణమాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా కాకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ భూక్యా గోపాల్

పాలకవీడు : మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరగకుండా, ప్రజా ధనం వృథా కాకుండా చూడాలని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. యల్లాపురం, గుడుగుంట్లపాలెం గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎంపీటీసీ వెంకటయ్య, ఉపేందర్‌లు మిషన్ భగీరథ అధికారులకు వివరించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో పర్మనెంట్ వైద్యులు, సిబ్బందిని నియమించాలని పలువురు డిమాండ్ చేశారు. దీనిపై గతంలో వైద్యశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 2024– 2025 సంవత్సరానికి గాను రెండు లక్షల పని ప్రదేశాలు గుర్తించినట్లు ఏపీఎం తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలు లబ్ధిదారులకు అందేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, ఎంపీఓ దయాకర్, వైస్ ఎంపీపీ ఉపేందర్‌రావు, అధికారులు, గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మతతత్వాన్ని పెంచేందుకే నూతన విద్యా విధానం



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కోటయ్య

కోదాడఅర్బన్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యా విధానం –2020ను రద్దు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు పొనుగోటి కోటయ్య డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో పీడీఎస్‌యూ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు పొల్లెబోయిన కిరణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మతతత్వాన్ని పెంచి పోషించడం కోసం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యార్థుల మెదడులో మూఢనమ్మకాలను చొప్పించడానికి ప్రయత్నం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలలో స్వతంత్ర్య సమరయోధుల పాఠ్యాంశాలను తీసివేసి మతోన్మాదులు, బ్రిటీష్ తొత్తుల చరిత్రలను తీసుకొచ్చి విద్యార్థులు పెడదోవ పట్టేలా చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులు శాస్త్రీయ పద్ధతిలో ఆలోచించి సమసమాజ స్థాపనకు పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌ను గద్దె దింపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని, బడ్జెట్‌లో విద్యకు సరైన నిధులు కూడా కేటాయించలేదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు, పీఐఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, సింహాద్రి, భరత్, రహీం, ఉదయ్, వేణు, ప్రవీణ్, నాగరాజు, శ్రీను, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నాయకుల నిరసన


మునగాలలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

మునగాల : ఇటీవల ఢిల్లీలో రైతులపై పోలీసులు కాల్పులు జరపడాన్ని వ్యతిరేకిస్తూ మునగాలలో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. పలువురు రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పోలీసుల కాల్పుల్లో యువ రైతు శుభచరణ్‌సింగ్ మృతి చెందినట్లు తెలిపారు. 2022లో ఢిల్లీలో రైతులు చేసిన సుదీర్ఘ పోరాటంతో మోదీ ప్రభుత్వం దిగివచ్చి రైతుల కోర్కెలను పరిష్కరిస్తానని రాతపూర్వకంగా తెలిపి ఏడాది పూర్తయినా నేటికీ ఒక్క హామీ అమలు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, గిట్టుబాటు ధరలు కల్పించాలని, రుణాలన్ని మాఫీ చేయాలని, వడ్డీలేని రుణాలే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకటరెడ్డి, బుర్రి శ్రీరాములు, మండల నాయకులు షేక్ సైదా, చందా చంద్రయ్య, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, గడ్డం వెంకన్న, దేవరం శ్రీనివాసరెడ్డి, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్, గ్రామ శాఖ నాయకులు కాసర్ల వెంకట్, కిన్నెర వెంకన్న, సీఐటీయూ మండల నాయకుడు బచ్చలకూరి స్వరాజ్యం పాల్గొన్నారు.

డబ్ల్యూటీఓతో ఒప్పందం రద్దు చేసుకోవాలి

కోదాడఅర్బన్ : ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)తో భారత్ ఒప్పందం రద్దు చేసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎంకేఎం) పిలుపులో భాగంగా కోదాడ పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు, వివిధ సంఘాల నాయకులు సత్యం, జానయ్య, సూర్యనారాయణ, స్వరాజ్యం, వెంకటేశ్వర్లు, ముత్యం, కిరణ్, భరత్, ఉదయగిరి, వీరాంజనేయులు, నర్సింహారావు, దాసరి శ్రీను, చందర్‌రావు, రవి, భద్రయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

నేరేడుచర్ల : రైతులు, కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రధాన నరేంద్ర మోదీ డబ్ల్యూటీఓ ఒప్పందాలను అమలు చేస్తున్నందుకు నిరసనగా సోమవారం సీపీఐఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో నేరేడుచర్లలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ డబ్ల్యూటీఓ ఒప్పందం ప్రకారం కేంద్రం ప్రభుత్వ ఆస్తులను ప్రైయివేటీకరిస్తుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా నల్ల చట్టాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్టీ నియోజకవర్గ కార్యదర్శి వాస పల్లయ్య, హుస్సేన్, కరుణాకర్, మరియమ్మ, సత్యక్క, పావని, లక్ష్మి, చెన్నమ్మ, సోమమ్మ, మౌలాంబి, రంగయ్య, కోటమ్మ, బుచ్చమ్మ, కావ్య, రేణుక తదితరులు ఉన్నారు.


నేరేడుచర్లలో మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు


కోదాడఅర్బన్ : నిరసన తెలుపుతున్న వామపక్ష ప్రజా సంఘాల నాయకులు

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం


స్వామివార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీ రుక్మిణీ సత్యభామ గోధ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని పూజారులు ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, స్వామివార్లకు పంచామృతాభిషేకం, మంగళాశాసనం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు పట్టు వస్త్రాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. విశ్వక్సేన, ఆరాధన, పుణ్యాహవచనం గావించి అనంతరం వేద మంత్రాల నడుమ కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, ధర్మకర్తలు సురభి కుషల్, కనకయ్య, సైదులు, ఆలయ సిబ్బంది కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి


హుజూర్‌నగర్‌రూరల్ : సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాలకవీడు : కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ బుజ్జీ మోతీలాల్ అన్నారు. సోమవారం మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గెలిచిన మూడు నెలల్లోనే సుమారు మూడు కోట్ల రూపాయల నిధులను మండల అభివృద్ధి పనులకు విడుదల చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్వీ సుబ్బారావు, మోతీలాల్ నాయక్, నర్సింహారావు, జ్యోతి, కూరపాటి శ్రీను, నాగయ్య, సైదులు, రామకృష్ణ, రాజు, సీతయ్య, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారం గ్రామంలో రూ. 40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో శ్మశానవాటికలో ప్రహరీ నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 50 లక్షల మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, కార్యదర్శి గిరిజాకుమారి, మాజీ సర్పంచ్ జయరాజు, శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వీరమోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

గరిడేపల్లి : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామంలో మంత్రి ఉత్తమ్ కుమారెడ్డి సహకారంతో మంజూరైన రూ.10లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మేకల నాగేశ్వరరావు, సాంబయ్య, రాములు, నర్సింహారావు, కోటయ్య, మట్టయ్య, వెంకటేశ్వర్లు, రాజు, జగన్, సందీప్, నాగరాజు, పరమేష్, మోహన్, ఓంకార్, కిరణ్, యల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


పాలకవీడు : సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


గరిడేపల్లి : వెలిదండలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న త్రిపురం అంజన్‌రెడ్డి

అలరించిన మోహిని భస్మాసుర నాటక ప్రదర్శన


కళాకారులను సత్కరిస్తున్న ఆలయ ఈఓ కొండారెడ్డి, కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన మోహిని భస్మాసుర నృత్య నాటిక అలరించింది. కళాకారుల అభినయం, డైలాగులు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులు దొంతగాని, జొన్నలగడ్డ గోవిందు, గోపనబోయిన వెంకటేశ్వర్లు, భద్రాచలం, నాన్సీ, సుధీర్, అఖిల, సుకన్య, శ్వేత, రేణుక, మురళి, శ్రీహరి, నాయుడులను ఈఓ కొండారెడ్డి, ఆలయ పూజారి దామోదరాచార్యులు, దేవాలయ కమిటీ సభ్యులు వెంకటనరసింహాచార్యులు, గుండా రమేష్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఇరువురిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

మునగాల : యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తాడువాయి గ్రామానికి చెందిన బషీరాబాద్ ఎంపీఓ మాతంగి రమేష్ సూచించారు. గురుకుల ఉద్యోగ నియామకాల్లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించి గురుకుల ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికైన జిల్లేపల్లి శోభన్ బాబు, గ్రంథాలయాధికారిగా ఎంపికైన కందగట్ల గీతలను ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శాలువాలతో సత్కరించారు. అదే విధంగా స్థానిక అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయులు సత్తార్, బాలరాజు, కరుణాకర్, కృష్ణవేణి, అంబేద్కర్ యూత్ సభ్యులు జిల్లేపల్లి సుమన్, మాతంగి సైదులు, గ్రామపెద్దలు లొడంగి నాగన్న, మాతంగి వెంకటేశ్వర్లు, కోట నాగరాజు, గోపి, లక్ష్మి, నారాయణ, మన్మథుడు, సైదాబాబు, చంటి, సైదమ్మ, పున్నమ్మ పాల్గొన్నారు.

27న సర్వసభ్య సమావేశం

నేరేడుచర్ల : ఈనెల 27వ తేదీన నేరేడుచర్ల మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మార్కెట్ చైర్మన్ పదవిని మునగాలకు కేటాయించాలి

మునగాల : కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మునగాల మండలానికి కేటాయించాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోగుల లక్ష్మణ్ కోరారు. సోమవారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ప్రభుత్వం ఎస్సీ వర్గానికి కేటాయించిందని మునగాల మండలంలో అర్హులైన వ్యక్తి, కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉండే వ్యక్తిని ఎంపిక చేసి చైర్మన్ పదవికి ఎంపిక చేయాలని లక్ష్మణ్ కోరారు.

నేడు బహిరంగ వేలం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం కిరాణ, జనరల్ స్టోర్, కొబ్బరి చిప్పలు సేకరణ హక్కుల కోసం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. కిరాణా జనరల్ స్టోర్స్‌కు రూ.3లక్షలు, కొబ్బరి చిప్పలు సేకరణ హక్కు కోసం రూ.50వేల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.